క్లుప్తంగా

రెడ్డి హాస్టల్ ఉపాధ్యక్షుడికి సన్మానం



గిరిధర్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చేవెళ్ల: పేరుప్రఖ్యాతులుగాంచిన రాజాబహదూర్ వెంకటరామారెడ్డి (రెడ్డి హాస్టల్) బోర్డు కమిటీ ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో రేగడి ఘనాపూర్‌కు చెందిన తిప్పని గిరిధర్‌రెడ్డి ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఆయన్ను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గిరిధర్‌రెడ్డి ఉపాధ్యక్షుడిగా ఎన్నికవడం తమ ప్రాంతానికి గుర్తింపును తెచ్చిందన్నారు. ఆయన్ను సన్మానించిన వారిలో వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పెంటయ్యగౌడ్, ఆగిరెడ్డి, కృష్ణారెడ్డి, డి. గోపాల్‌రెడ్డి, కెఎల్‌ఆర్ శ్రీనివాస్‌రెడ్డి, రాములు, ప్రభాకర్, రవీదర్ తదితరులు ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్యం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



ఫిజియోథెరపీ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

చేవెళ్ల: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాయ్య అన్నారు. శుక్రవారం ఆయన పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డితో కలిసి మండల కేంద్రంలో డాక్టర్ వై.రవీంద్‌గౌడ్ ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ, రిహాబిలిటేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అత్యాధునిక టెక్నాలజీతో ఫిజియోథెరపీ, రిహాబిలిటేషన్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఆగిరెడ్డి, శైలజ, సమత, శ్రీకాంత్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మధుసుధన్ గుప్తా, రాంరెడ్డి, ప్రభాకర్, జంగారెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, సాయికిరణ్, విఘ్నేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

రైతుల జీవితాలతో ఆడుకోవద్దు

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్

కడ్తాల్: నిరుపేద రైతుల వ్యవసాయ పొలాల మీదుగా హైటెన్షన్ లైన్ వేసి, వారి జీవితాలతో ఆడుకోవద్దని, వెంటనే 765కేవీ విద్యుత్ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్ డిమాండ్ చేశారు. అలైన్‌మెంట్‌ను మార్చాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో బాధిత రైతులు చేపట్టిన దీక్ష శుక్రవారానికి 19వ రోజుకు చేరుకుంది. దీక్షకు పలు సంఘాల నాయకులు సంఘీభావంగా మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, పాండు, లక్ష్మణ్, శ్రీను, లక్ష్మనాయక్, పెంటారెడ్డి, రాజేందర్‌యాదవ్, వెంకట్‌రాములు గౌడ్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి

కడ్తాల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధి పల్లెచెలకతండాలో టీజీఐఐసీ నిధులు రూ.1 కోటితో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు వారు భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ తదితరులు ఉన్నారు.

సమావేశం వాయిదా వేయాలి

కందుకూరు: కొద్ది రోజులు చైర్మన్‌గా కొనసాగిన వెంకట్రామ్‌రెడ్డి అధ్యక్షతన ఈ నెల 29న నిర్వహించే పీఏసీఎస్ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేయాలని సంఘం డైరెక్టర్లు కోరారు. శుక్రవారం సీఈఓ యాదగిరిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ.. హైకోర్టు ఉత్తర్వుల మేరకు పాత చైర్మన్ చంద్రశేఖర్ కొనసాగుతున్నారని తెలిపారు. చేపట్టనున్న సమీక్షను రద్దుచేసి, డీసీఓ ఆదేశాల అనంతరం సమావేశం నిర్వహించాలని పేర్కొన్నారు. డైరెక్టర్లు విజేందర్‌రెడ్డి, ఆనంద్, శేఖర్‌రెడ్డి, పర్వతాలు పాల్గొన్నారు.

భారీ గుంతలు.. నిలిచిన రాకపోకలు

మొరాయిస్తున్న వాహనాలు



గుంతల రోడ్డు మీద నిలిచిన నీటిలో వెళ్తున్న వాహనాలు

- చిలుకూరు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్న ప్రజలు
- నెల రోజులుగా పారుతున్న అలుగు
- వర్షాలకు మళ్లీ పెరిగిన వరద
- పట్టించుకోని అధికారులు

మొయినాబాద్: పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందంగా మారింది చిలుకూరు దుస్థితి. బాలాజీ ఆలయంతో చిలుకూరు పేరు ప్రపంచ వ్యాప్తంగా పాకింది. ఇంతటి పేరొందిన గ్రామానికి ఇప్పుడు రాకపోకలే బంద్ అయ్యాయి. శాఖల సమన్వయ లోపం.. అధికారుల నిర్లక్ష్యం ఈ పరిస్థితికి కారణమైంది.

గుంతలమయంగా రహదారి

మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు గ్రామానికి వెళ్లేందుకు వాహనదారులు, స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడగా ప్రస్తుతం పూర్తిగా బంద్ అయ్యాయి. ఆగస్టులో కురిసిన వర్షాలకే స్థానిక పెద్ద చెరువు పూర్తిస్థాయిలో నిండింది. అలుగు కింది భాగంలో రోడ్డును ఒక అడుగు ఎత్తు వేడయంతో చెరువులో బ్యాక్ వాటర్ పెరిగి పంటపొలాలు మునిగాయి. చెరువులో నీరు ఎక్కువై రోడ్డుపై పారడంతో గుంతలు ఏర్పడ్డాయి. అప్పటి నుంచి వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగించారు. శుక్రవారం భారీ వర్షాలు కురవడంతో నీటి ప్రవాహం ఎక్కువైంది. దానికి తోడు రోడ్డుపై గుంతల పెద్దవి కావడంతో వాహనాలు అందులోనే ఇరుక్కుపోతున్నాయి. శుక్రవారం ఓ కారు గుంతలో ఇరుక్కుని ఇంజన్‌లోకి నీళ్లు వెళ్లి పొగలుగక్కింది. గమనించిన స్థానికులు వెంటనే కారును బయటకు లాగారు. గుంతలు పెద్దవి కావడంతోపాటు వరద పెరగడంతో వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణమంటేనే జంకుతున్నారు. ఆర్టీసీ బస్సులు చిలుకూరు పెద్ద చెరువు కట్టపైనుంచే వెనక్కి తిప్పుకుని వెళ్తున్నారు. దీంతో చిన్నమంగళారం, అప్పోజీగూడ, ఎనికేపల్లి, టంగటూరు గ్రామాలకు వెళ్లేవారు అవస్థలు పడుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

చిలుకూరు పెద్ద చెరువు అలుగు పారుతూ రోడ్డుపై గుంతలు ఏర్పడి నెల రోజులు దాటినా అధికారులు పట్టించుకోవడంలేదు. నెల రోజుల క్రితమే అదనపు కలెక్టర్ శ్రీనివాస్ పెద్ద చెరువును పరిశీలించారు. అలుగు నీరు కిందికి వెళ్లే విధంగా, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వారు మాత్రం తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. అదనపు కలెక్టర్ ఆదేశాలను సైతం బేఖాతరు చేశారు. ఇరిగేషన్ అధికారులు అలుగు లెవల్‌కు పేరుకుపోయిన మట్టి మాత్రం తొలగించారు. కానీ మున్సిపల్, ఆర్ అండ్ బీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



గుంతలో ఇరుక్కున్న కారు నుంచి వస్తున్న పొగ

తీవ్ర ఇబ్బందులు



పెద్ద చెరువు అలుగు పారుతుండడంతో రాకపోకలకు ఇబ్బంది అవుతుంది. నెల రోజుల నుంచి రోడ్డు పైనుంచి అలుగు నీరు పారడంతో గుంతలు ఏర్పడ్డాయి. గుంతల్లో వాహనాలు ఇరుక్కుపోయి పాడవుతున్నాయి. ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. శుక్రవారం ఓ కారు ఇంజిన్ ఫెయిల్ అయింది.

– జొన్నాడ రాజు, చిలుకూరు

కబ్జాలతోనే దుస్థితి



పెద్ద చెరువు వద్ద రోడ్డు పాడయి నెల రోజులు అవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. శాఖల మధ్య సమన్వయం లేదు. వారి నిర్లక్ష్యం కారణగా పూర్తిగా రాకపోకలు నిలిచాయి. మొయినాబాద్‌ని చెరువులు, కాలువలు కబ్జాలకు గురికావడంతోనే పెద్ద చెరువులోకి వరద భారీగా వస్తుంది. ఇందుకు అధికారులు, ప్రజాప్రతినిధులే కారణం. చిలుకూరుకు రావడానికి ప్రత్యామ్నాయ రోడ్డు కూడా లేదు. జిల్లా అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి.

– పి.వీరభద్రస్వామి, మాజీ సర్పంచ్, చిలుకూరు

వరద ఆగితేనే..



నెల రోజులుగా చెరువు అలుగు నీరు రోడ్డుపై నుంచి పారుతుండడంతో గుంతలు ఏర్పడ్డాయి. పక్క నుంచి పైపులు వేసి బైక్‌లు, పాదచారులు వెళ్లేందుకు వీలుగా ఏర్పాట్లు చేశాం. కార్లు, పెద్ద వాహనాలు వెళ్లే రోడ్డు గుంతలు ఎక్కువై ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వరద ఆగితేనే రోడ్డు బాగుచేసే అవకాశం ఉంటుంది.

– ఖాజా మొయిజుద్దీన్, మున్సిపల్ కమిషనర్, మొయినాబాద్

సిరి ధాన్యాల్లోనే పోషకాలు



పోషన్ అభియాన్‌లో అంగన్‌వాడీ టీచర్లతో సీడీపీఓ ఉదయ

ఐసీడీఎస్ సీడీపీఓ ఉదయ

నందిగామ: సిరిధాన్యాల్లో పోషకాలు అధికంగా ఉంటాయని, సాధ్యమైనంత వరకు సిరిధాన్యాలతో చేసిన ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఉదయ అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. మండల కేంద్రమైన నందిగామలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీబాయి ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా పోషన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీడీపీఓ ఉదయ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉదయ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, సిరిధాన్యాలు తీసుకోవాలని వివరించారు. చిన్నారులకు చిన్నప్పటినుంచే పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం అలవాటు చేయాలని చెప్పారు. ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని బాలింతలకు, గర్భిణీలకు అవగహన కల్పించాలన్నారు. అనంతరం బతుకమ్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాటీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

మండల వైద్యాధికారి అన్నపూర్ణ

మొయినాబాద్ రూరల్: మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని.. అందులో భాగంగానే ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని మండల వైద్యాధికారి అన్నపూర్ణ అన్నారు. మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం 'ఆరోగ్య మహిళ శక్తివంతమైన కుటుంబం'కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. స్పెషలిస్ట్ డాక్టర్లతో మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాలు శక్తివంతంగా, బలంగా ఉంటాయన్నారు. అందుకోసం పీహెచ్‌సీలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ఈఎన్‌టీ, నేత్ర, బీపీ, షుగర్, దంత పరీక్షలు, కేన్సర్, రక్తహీతన, టీబీ వంటి పరీక్షలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కోఠి ఈఎన్‌టీ ఆసుపత్రి వైద్యుడు రమేష్, ఉస్మానియా ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ క్రాంతి, ఉస్మానియా జనరల్ సర్జన్ ప్రత్యూష, సీహెచ్‌వీ వెంకట్‌రెడ్డి, పద్మ తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్ సీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

జిల్లా మహాసభకు జర్నలిస్టులు

షాద్‌నగర్: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా 3వ మహాసభను శుక్రవారం కందుకూర్‌లోని శుభం గార్డెన్‌లో నిర్వహించారు. ఈ మహాసభకు షాద్‌నగర్ నుంచి పెద్ద ఎత్తున జర్నలిస్టులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పట్టణంలో జర్నలిస్టులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహాసభకు వెళ్లే వాహనాల ర్యాలీని సీనియర్ పాత్రికేయుడు ఖాజాపాషా జెండా ఊపి ప్రారంభించారు. సభకు తరలివెళ్లిన వారిలో జర్నలిస్టులు వేణుగోపాల్, రంగనాథ్, లక్కాకుల రమేశ్, మన్సూర్ అలీఖాన్, రాఘవేందర్‌గౌడ్, నర్సింహారెడ్డి, నరేశ్, శ్రీనివాస్, విష్ణు, రాజశేఖర్, సలీం ఉన్నారు.



చేవెళ్ల: నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, కాంగ్రెస్ నాయకులు



షాద్‌నగర్: ఐలమ్మ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు



చేవెళ్ల: నివాళులర్పిస్తున్న బీజేపీ, రజక సంఘం నాయకులు

విప్లవ వేగుచుక్క.. ఐలమ్మ

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల పరిధిలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పలువురు నేతలు, రజక సంఘాల నేతలు ఆమె విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలేసి నివాళి అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మాట్లాడుతూ.. విప్లవ వేగుచుక్క చాకలి ఐలమ్మ అన్నారు. ఆమె పోరాట స్ఫూర్తితో మలిదశ తెలంగాణ ఉద్యమం కొనసాగిందని గుర్తు చేసుకున్నారు.

– చేవెళ్ల, షాద్‌నగర్ జోన్ బృందం



షాద్‌నగర్: నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



శంకర్‌పల్లి: ప్రొద్దుటూరులో..



కొందుర్గు: ఐలమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు



మొయినాబాద్: ప్రజా సంఘాల నాయకులు



నందిగామ: నివాళి అర్పిస్తున్న నేతలు



షాబాద్: రజక సంఘం జేఏసీ ఆధ్వర్యంలో..



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్ రక్షమైసమ్మ ఆలయంలో..



మొయినాబాద్‌రూరల్: నక్కలపల్లిలో..

బతుకమ్మ ఆటలు.. దుర్గమ్మకు పూజలు

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల పరిధిలో బతుకమ్మ వేడుకలు, దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆయా మండపాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారిని శుక్రవారం మహాలక్ష్మిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. బతుకమ్మ వేడుకల్లో మహిళా సంఘాల సభ్యులు, పలువురు మహిళా నేతలు పాల్గొని ఆడిపాడారు.

– చేవెళ్ల, షాద్‌నగర్ జోన్ బృందం



శంకర్‌పల్లి: బతుకమ్మ సంబురాల్లో ఏఎంసీ చైర్‌పర్సన్ గోవిందమ్మ, కమిషనర్ యోగేశ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి తదితరులు



షాద్‌నగర్: ఎలికట్టలో లలిత త్రిపుర సుందరిగా అమ్మవారి దర్శనం



చేవెళ్ల: బాలాజీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో హంసవాహన సేవ



చేవెళ్ల: కుంచం నారాయణ సన్స్ ఆధ్వర్యంలో రచ్చబండ వద్ద అన్నదానం



షాద్‌నగర్: అమ్మవారి పూజలకు హాజరైన ఎమ్మెల్సీ దంపతులు, నాయకులు

అవగాహనతోనే ఆర్థిక అభివృద్ధి

పశువైద్య విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ కొండల్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: పాల ఉత్పత్తిపై రైతులకు అవగాహన ఉంటేనే ఆర్థికాభివృద్ధి సాధిస్తారని పశువైద్య విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.కొండల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పి.వి.నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో 'శాస్త్రీయ డెయిరీ సాగు-పాల ఉత్పత్తుల విలువ జోడింపు'పై ఆస్ట్రేలియా రాయబారి కార్యాలయం ప్రత్యక్ష సహాయ కార్యక్రమంలో భాగంగా ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేడిపల్లిలోని పాల రైతులు, మహిళలు, యువతకు ఈ శిక్షణకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఫార్మర్ డీన్ అండ్ ప్రొఫెసర్ డాక్టర్ రఘునందన్, డాక్టర్ ఎం.శశికుమార్, డాక్టర్ ఎం.సాహిత్యరాణి, రత్నాకర్, అభ్యుదయ పాడి రైతు యాదయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం శిక్షణకు హాజరైన పాడి రైతులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.



సర్టిఫికెట్లు అందుకున్న పాడి రైతులు